



19 వ వసంతంలోకి ...

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

సోమవారం 2 మార్చి 2026



# నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

- కచ్చితమైన డేటా సేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- పూర్తిస్థాయి అవగాహనకు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి
- క్షేత్రస్థాయిలోనూ శిక్షణ కార్యక్రమాలను పగడ్బందీగా నిర్వహించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ





**విజయవాడ బ్యూరో, మార్చి 1, మేజర్ న్యూస్ :** జనగణన విధులను అత్యంత నిబద్ధతతో, జవాబుదారీతనంతో నిర్వర్తించాలని డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. కచ్చితమైన డేటా సేకరణ దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాదిగా నిలుస్తుందని, అందువల్ల ప్రతి అధికారి, సిబ్బంది తమ బాధ్యతలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకుని **మిగతా 2లో...**



## అంగన్‌వాడీలకు అండగా కూటమి

### సంక్షేమంలో చరిత్రాత్మక నిర్ణయాలు

### ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** ఆదివారం సింగ్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, సూపర్‌వైజర్ల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది అని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలో తొలిసారిగా రెండు సార్లు అంగన్‌వాడీ వేతనాలను పెంచిన ఘనత ఈ ప్రభుత్వానిదే. అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాల **2లో..**



## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

5



## అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

### ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

**గన్నవరం, మార్చి 1, మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్వాడి టీచర్లు,హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గతంలో ఎన్నడు లేని విధంగా చరిత్రలో తొలిసారి అంగన్వాడీ టీచర్ల వేతనాలను రెండుసార్లు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. అంగన్వాడీలకు ఎన్నికల్లో ఇచ్చిన **మిగతా 2లో...**

(మొదటిపేజీ తరువాయి)

## అంగన్‌వాడీలకు అండగా కూటమి

అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తూ రూ.86.68 లక్షలు విడుదల చేసి ప్రతి కేంద్రానికి ప్రత్యేక నిధులు కేటాయించింది.. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేస్తూ జీతాల ఆలస్యానికి శాశ్వత చెక్ పెట్టింది. 58,204 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5+ స్మార్ట్‌ఫోన్లు అందజేసి సేవలను మరింత వేగవంతం చేసింది.. అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు 70% నుండి 96%కు పెరగడం కూటమి పాలనలో వచ్చిన స్పష్టమైన మార్పు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన గ్రాట్యుటీ కలను నిజం చేస్తూ 2025 బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించింది.. అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలు, =ా సదుపాయం, టాయిలెట్లు, ఇండక్షన్ స్టౌవ్‌లు, వంట పాత్రలు, పిల్లల ఆటవస్తువులు అందజేసి మౌలిక సదుపాయాలను బలోపేతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు 5,000 మంది కొత్త సిబ్బందిని నియమించనుంది.. అంగన్‌వాడీలు ప్రతిపాదించిన 9 డిమాండ్లను ఇప్పటికే పరిష్కరించిన ప్రభుత్వం, మిగిలిన అంశాలను కూడా దశలవారీగా అమలు చేయడానికి చర్యలు చేపట్టింది.. ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షే మానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోంది. గత ప్రభుత్వ ఆర్థిక నిర్లక్ష్యానికి భిన్నంగా, ఈ ప్రభుత్వం బాధ్యతాయుత ఆర్థిక నిర్వహణతో సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తోంది అని తెలియజేసారు... ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కష్టమోహన్ పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్లు స్పష్టం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 కోట్లు విడుదల చేసి చేసిన సంగతి గుర్తు చేశారు. అంగన్వాడీలకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు ఇస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జి స్మార్ఫోన్లు అందచేసినట్లు చెప్పారు. గ్రాట్యూటీ చెల్లింపుల కోసం 2025 రాష్ట్ర బడ్జెట్లో రూ. 20 కోట్లు కేటాయించి అంగన్వాడీలకు అండగా నిలిచామన్నారు. అంగన్వాడి కేంద్రాలకు టీవీ, ఆర్వో, టాయిలెట్ సౌకర్యాలు కల్పించడంతోపాటు టీచర్లకు, ఆయాలకు వేసవిలో 15 రోజులు సెలవులు ఇస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐదువేల మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేసి మినీ అంగన్వాడి కార్యకర్తలకు టీచర్లుగా పదోన్నతులు కల్పిస్తున్నామని, 5 వేల మంది అంగన్వాడి సహాయకులను నియమించబోతున్నట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల అంగన్వాడీల్లో హాజరు 70 నుంచి 96 శాతానికి పెరగటం శుభ పరిణామం అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారికి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని వెంకట్రావు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో వేధింపులు, ఇబ్బందులకు గురైన ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ హామీ ఇచ్చారు.

# నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

(మొదటిపేజీ తరువాయి)

పనిచేయాలని సూచించారు. ఆదివారం విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో సెన్సస్2027కు సంబంధించిన తొలి దశ (హౌస్ లిస్టింగ్ & హౌసింగ్ సెన్సస్)పై జిల్లా సెన్సస్ అధికారులు, ఛార్జ్ స్థాయి అధికారులకు నిర్వహించిన మూడో రోజు, చివరి శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ (హైదరాబాద్) కార్యాలయ జాయింట్ డైరెక్టర్ జి. ప్రసన్న కుమార్ కూడా కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ద్వారా అధికారులకు సమగ్ర అవగాహన కల్పించబడిందన్నారు. ఇందులో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడమే అసలు విజయమని, అందుకుగాను క్షేత్రస్థాయిలో సిబ్బందికి పగడ్బందీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈసారి జనగణన ప్రక్రియ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడనుందని తెలిపారు. మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ మాడ్యూల్‌లు, డేటా అప్లోడింగ్ వ్యవస్థలపై సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక లోపాలు, డేటా ఎంట్రీ పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు





తీసుకోవాలని సూచించారు. జనాభా లెక్కల సేకరణ రెండు దశల్లో జరుగుతుందని వివరించారు. తొలి దశగా హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్, రెండో దశ పాపులేషన్ ఎన్యూమరేషన్ (పీఈ)లో జనాభా గణాంకాలు నమోదు చేయబడతాయని చెప్పారు. ఈ రెండు దశలు సమగ్రంగా, ఖచ్చితంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. జనగణన ద్వారా లభించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు, వనరుల సమర్థ వినియోగానికి కీలకమని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల వంటి రంగాలలో సరైన ప్రణాళిక రూపొందించాలంటే ఖచ్చితమైన గణాంకాలు అవసరమన్నారు. అందువల్ల అత్యంత పారదర్శకతతో, నిబద్ధతతో, ఎలాంటి వివక్ష లేకుండా సమాచారం సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎం. లక్ష్మీనరసింహం, సీపీవో వై. శ్రీలత, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏఎస్‌వోలు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# మన నగరం సుందరంగా పరిశుభ్రంగా ఉండాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** మన నగరం ఎల్లప్పుడూ సుందరంగా, పరిశుభ్రంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆదివారము ఉదయం తన పర్యటనలో భాగంగా మహాత్మా గాంధీ రోడ్ పటమట బెంజ్ సర్కిల్ హైవే ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరం సుందరంగా, పరిశుభ్రంగా ఉండాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రోడ్డుపైన గుంతలు పడితే, వెంటనే ప్యాచ్ వర్క్ చేయాలని, నగర సుందరీకరణంలో ఏవైనా లోపాలు కనిపించినచో వెంటనే సుందరీకరణ పనులు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని, నగరం ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండుటకు పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా గేటట్టు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, రహదారుల్లో అనధికార బ్యానర్లు లేకుండా



తొలగిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలను ఆచరణలో పెడుతున్న నాయకుడు ఎంపీ కేశినేని శివనాథ్

### టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య

**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో అర్బన్ ప్రాంత, రూరల్ నియోజకవర్గాల మండలాలకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలతో పాటు ప్రతి మహిళ ఎంటర్ ప్రెన్యూర్ తయారై రాణించాలనే లక్ష్యంతో ఎంపీ కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో కేశినేని ఫౌండేషన్ ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో కృషి చేస్తున్నారని, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య అన్నారు.ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డిలో మార్చి 2వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు ఐదు రోజులు పాట నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందే 45 మంది మహిళలతో ప్రత్యేక బస్సు ఆదివారం ఇబ్రహీం పట్నం రింగ్ సెంటర్ నుంచి బయలు దేరింది. హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డికి బయలుదేరిన ఈ బస్సుకు ఇబ్రహీం పట్నం రింగ్ సెంటర్‌లో కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య స్థానిక నాయకులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ఎన్.ఐ.ఆర్.డి లో 12వ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఐదు రోజుల శిక్షణ తీసుకునేందుకు వెళ్లిన 45 మంది ఎస్.హెచ్.జి మహిళలకు మష్రూమ్స్, హోమ్ బేస్ట్ ప్రొడక్ట్స్ తయారీ విధానం పై శిక్షణ ఇస్తారు. ఎన్టీఆర్ జిల్లాలోని రూరల్ నియోజకవర్గాలైన నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాలకు చెందిన 45 మంది ఎస్.హెచ్.జి మహిళలను ఎంపీ కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు పంపించటం జరిగింది. మష్రూమ్స్, హోమ్ బేస్ట్ ప్రొడక్ట్స్ తయారీ విధానం పై శిక్షణ తరగతులు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డిలో సోమవారం నుంచి ప్రారంభం అవుతాయి.ఈ సందర్భంగా కొండపల్లి చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్ కృషి వల్ల ఎస్.హెచ్.జి మహిళలజీవితాల్లో వారి జీవనోపాధి




మెరుగుపర్చుకునేందుకు చక్కని అవకావం లభించిందన్నారు. గత ఏడాది కాలం నుంచి ఎంపీ కేశినేని శివనాథ్ సుమారు 500 మహిళలకు ఎన్.ఐ.ఆర్.డి లో పలు స్వయం ఉపాధిగా చేసుకునే పలు ఉత్పత్తుల తయారీకి సంబంధించి శిక్షణ ఇప్పించటం జరిగిందన్నారు. మహిళల సాధికారికత, ఆర్థిక స్వాలంబన కోసం ఎంపీ కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో కేశినేని ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి నైపుణ్యాభివృద్ధిశిక్షణలు ఎంతో దోహదపడతాయన్నారు.

మష్రూమ్స్, హోమ్ బేస్ట్ ప్రొడక్ట్స్ తయారీ వంటి ఉపాధి అవకాశాలు గ్రామీణ మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గంగా మారుతాయని పేర్కొన్నారు.టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య మాట్లాడుతూ మహిళలు సాధికారత, స్వయం సమృద్ధి సాధించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో కేశినేని ఫౌండేషన్ ఎస్.హెచ్.జి మహిళలకు చేయూతగా నిలుస్తుందన్నారు. ఇంటికి ఒక పారిశ్రామిక వుండాలన్నముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయానికి ఎంపీ కేశినేని శివనాథ్ ఆచరణలో పెట్టాడని కొనియాడారు.. జిల్లాలో ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామిక వేత్త తయారు కావాలన్నదే ఎంపీ కేశినేని శివనాథ్ లక్ష్యమన్నారు. శిక్షణ పొంది వస్తువులు ఉత్పత్తి చేస్తున్న మహిళలతో ఎంపీ కేశినేని శివనాథ్ స్వయంగా మాట్లాడరని, వారి కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళల జీవనోపాధి మెరుగుదల కోసం ఇలాంటి శిక్షణ గత పదేళ్లలో ఏ నాయకుడు ఇప్పించలేదన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి రూరల్ కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ, సహకార సంఘ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు కోయ నెహ్రూ, కౌన్సిలర్ పులిదాసు, మైలవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రకాష్, ఎస్టీ నాయకులు మేడా శ్రీను, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ మాబు సుభానిలతో పాటు స్థానిక ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటం

### జిల్లా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు & పెన్షనర్ల సంయుక్త చర్యా సమితి (జేపీసీ) ఛైర్మన్‌గా డిఎస్ఎన్ రెడ్డి






**విజయవాడ మేజర్ న్యూస్ :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల హక్కుల పరిరక్షణ, సాధికారత, సంక్షేమం లక్ష్యంగా ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కార్యాచరణ సమితి (జేపీసీ) కమిటీ పని చేస్తుందని నూతన చైర్మన్ గా ఎన్నికైన డి.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం గాంధీనగర్ లోని ఎపిఎన్జిఓ హోమ్ వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సమావేశమై జే ఏ సి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జే ఏ సి జిల్లా చైర్మన్ గా డి. సత్యనారాయణ రెడ్డి (ఏపీ ఎన్జీజీఓజిల్లా అధ్యక్షుడు), కో-చైర్మన్ లు గా పి. రమేష్ (జిల్లా కార్యదర్శి, ఏపీఎన్జీఓ సంఘం) జి. అనుగ్రహ ప్రసాద్ (రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం) చి.రామకృష్ణ (రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ) ఉపాధ్యక్షులుగా జి. నారాయణరావు (పెన్షనర్ల సంఘం) ఎస్.కె. నవాబ్ జాని (పీఆర్టీయూ) కె. ప్రభాకర్ (సివిల్ పెన్షనర్స్ సంఘం) జి. అజయ్ కుమార్ (మున్సిపల్ కార్పొరేషన్), ప్రధాన కార్యదర్శిగా ఎస్.డి. ఖాసిం (ఏపీటీ ఎఫ్-257), నిర్వహణ కార్యదర్శి: జి. రామకృష్ణ (ఏపీఎన్జీఓల సంఘం), సంయుక్త కార్యదర్శులుగా ఎం. అక్కిరాజు (విశ్వవిద్యాలయం), సుందరయ్య (యుటిఎఫ్) షమా బేగం (ప్రభుత్వ నర్సుల సంఘం), రవీంద్ర (ఏపీటీఎఫ్-1938) పి. నాగరాజు (పీఆర్టీయూ-డి), జి. సుదర్శనరావు (నాలుగో తరగతి ఉద్యోగులు), ఆర్. రాంబాబు (గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది), కోశాధికారిగా బి. సతీష్ కుమార్ (ఏపీఎన్జీఓ సంఘం), కార్యవర్గ సభ్యులుగా విష్ణువర్ధన్ రావు (పెన్షనర్ల సంఘం), టి. రాజేంద్ర ప్రసాద్ (పంచాయతీ కార్యదర్శుల సంఘం), పి. శ్రీనివాస్ (పర్సనల్ అకౌంట్స్ ఆఫీసర్-పీఏఓ), సందీప్ (సహకార శాఖ), శ్రీనివాస్ (ప్రజారోగ్య డిప్లొమా ఇంజనీర్ల సంఘం), వి. శ్రీనివాసరావు (వ్యవసాయ శాఖ), కె. కృపానందం (ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం) జాన్సన్ (ఖజానా శాఖ), పి.బి. పెద్దిరాజు (ఎక్సైజ్ శాఖ), కె. నరసింహారావు (ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం), కె. పాండురంగరావు (ఆంధ్రప్రదేశ్ సాంకేతిక అధికారుల సంఘం) వి. సతీష్ (పారిశ్రామిక శిక్షణ సంస్థ-ఐటీఐ), శిరీష (మహిళా, శిశు సంక్షేమ శాఖ), కె.ఆర్.ఎస్. గణేష్ (వాణిజ్య పన్నుల శాఖ) కె. అప్పారావు (సాగునీటి ఐసీ అసిస్టెంట్ల సంఘం) సిహెచ్.సాయి కిషోర్ (సాగునీటి ఎన్జీఓల సంఘం), జె.పి.కె. ప్రసాద్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) వివిధ శాఖలు, సంఘాలకు చెందిన నాయకుల తో కార్యవర్గం ఏర్పాటైన నూతన జేపీసీ ఉద్యోగుల పక్షాన నిర్విరామంగా పోరాడేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఇందులో పెన్షనర్లు, పంచాయతీ కార్యదర్శులు, సహకార శాఖ, వ్యవసాయ శాఖ, ఖజానా శాఖ, నిషేధ & ఎక్సైజ్, జూనియర్ లెక్చరర్లు, సాంకేతిక అధికారులు, రవాణా శాఖ, మహిళా & శిశు సంక్షేమ శాఖ, వాణిజ్య పన్నుల శాఖ, సాగునీటి శాఖ తదితర విభాగాల ప్రతినిధులు ఉన్నారు.

జేపీసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్ల బి సాధనకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.

# స్వామివారి వివాహ వేడుకలకు శ్రీకారం

**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న నాట్యాచార్యుల ఇలవేల్పైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి కళ్యాణానికి ఆదివారం ముత్తైదువులు శ్రీకారం చుట్టారు. కూచిపూడి, పెదపూడి గ్రామానికి చెందిన మహిళలతోపాటుశాశ్వత ఉభయదాతల కుటుంబాలకు చెందిన మహిళలు సైతం ఈ వేడుకలలో పాల్గొని శుభ సూచకంగా మంగళ వాయిద్యాల నడుమ ముత్తైదువులు పాటలు పాడుతూ పసుపుకొట్టారు. ఈ సందర్భంగా మహిళలు గ్రామ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.



# జేఈఈ మెయిన్ 2026 ఫలితాల్లో సత్తా చాటిన వేదాంతు

**విజయవాడ మేజర్ న్యూస్ :** జేఈఈ మెయిన్ 2026 సెషన్ 1లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. 118 మంది వేదాంతు విద్యార్థులు 90శాతం కంటే ఎక్కువ స్కోర్ చేయడంతో, ఈ ప్రాంతంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ నుండిఅత్యధికంగా సాధించిన వారిలో సాహిల్ బి ప్రథమస్థానంలో ఉన్నాడు. అతను 99.72 శాతం సాధించాడు. భాస్కరబట్ల సాయి ఆదిత్య 99.51 శాతం, డిఎం అశ్వత్ 99.34 శాతంతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ ముగ్గురు ఈ ప్రాంతంనుండి అధిక స్కోరర్ల జాబితాలో ఉన్నారు. మొత్తం మీద, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి ముగ్గురు వేదాం తువిద్యార్థులు 99.5 శాతం కంటే ఎక్కువ స్కోర్ చేశారు. 10 మంది విద్యార్థులు 99 శాతం మార్కునుదాటారు. దీనిద్వారా టాప్ పర్సంటైల్ బ్రాకెట్లలో స్థిరమైన పనితీరును వేదాంతుప్రతిబింబిస్తుందని మరోసారి నిరూపితం అయ్యింది. ఆంధ్రప్రదేశ్ & తెలంగాణలో విద్యా రంగంలో వస్తోన్న అభివృద్ధి, మార్పునకు సంకేతంవేదాంతు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా 17 లెర్నింగ్ సెంటర్స్ ను నిర్వహిస్తోంది. ఈ కేంద్రాలు ఇప్పుడుసెకండ్ ఫుల్ అకడమిక్ సైకిల్ లో ఉన్నాయి. గతేడాది కూడా జాతీయ స్థాయి పోటీ పరీక్షలలోవేదాంతు విద్యార్థులు అధిక సంఖ్యలో సత్తా చాటారు. ఈ కేంద్రాలకు మరింతశక్తినిచ్చేలా ఇక్కడ వేద్ అనే ఏఐ టూల్ ని ఉపయోగిస్తున్నారు. దీనిద్వారా ప్రతి తరగతిగదిలో ప్రతి విద్యార్థి యొక్క సామర్థ్యాన్ని వ్యక్తిగతంగా పరీక్షించడం, అతడు ఎక్కడఇబ్బంది పడుతున్నాడు లాంటి విషయాల్ని చాలా సులభంగా కనుక్కునే అవకాశం ఉంటుంది. స్మార్ట్క్లిక్కర్ల ద్వారా, తరగతిలో విద్యార్థులరెస్పాన్స్‌లు రియల్ టైమ్‌లో ట్రాక్ చేస్తారు. తద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క లోటుపాటుల్ని తక్షణమే గుర్తించగలుగుతారు. క్లాస్ రూమ్ సమయం కాకండా, విద్యార్థులు పర్సనల్ విద్యా మార్గదర్శకత్వం కోసం వేద్ ఏఐని ఉపయోగించుకోవచ్చు. ప్రశ్నను టైప్ చేయడం లేదా అప్‌లోడ్ చేయ డం ద్వారా 24×7 సందేహ నివృత్తి కోసం ఇన్‌స్టాసోల్వ్‌ను ఉపయోగిస్తారు. ప్రశ్న మరింత బాగా అర్థం కావడం కోసం సిస్టమ్ ఫోకస్ చేసిన వీడియోలు, గమనికలు, క్విజ్‌లను సిఫార్సు చేస్తుంది.




ఈ ప్రాంతంలో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులనుఅభినందిస్తూ, వేదాంతు సహ వ్యవస్థాపకుడు, సీఈవో వంశీ కృష్ణ మాట్లాడారు... ఆయన మాట్లాడుతూ.. "ఈ ఫలితాలు ఎన్నో ఏళ్లుగా మేం నమ్మిన విశ్వాసాన్ని, సరైన మార్గదర్శకత్వంద్వారా అన్‌లాక్ చేయబడిన సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా 17 లెర్నింగ్ సెంటర్స్ విజయాలతో మేం విస్తరణ ప్రణాళికలు కూడా రచిస్తున్నాము.తద్వారా ఈ ప్రాంతంలో, భారతదేశం అంతటా పర్సనలైజ్డ్ లెర్నింగ్ అందించేందుకు మేంసిద్ధంగా ఉన్నామని అన్నారు ఆయన. జేఈఈ మెయిన్ సెషన్ 1లో మా విద్యార్థులు ఈ స్థాయిలోప్రదర్శన ఇవ్వడం మాకు ఎంతో ఆనందాన్ని స్ఫూర్తిని అందించిందని అన్నారు వేదాంతు సహ వ్యవస్థాపకుడు&విద్యావేత్తల అధిపతి ఆనంద్‌ప్రకాష్. "ప్రతి విద్యార్థికి వచ్చిన శాతం వెనుక పట్టుదల, కఠోర క్రమశిక్షణకథనం ఉంటుంది. ఈ ఫలితాలు మా సమగ్ర సాంకేతిక నమూనా, బోధనా నైపుణ్యం, వ్యక్తిగతీకరించిన విద్యామద్దతు యొక్క బలాన్ని ప్రతిబింబిస్తాయి." అని అన్నారు ఆయన...

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం..

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 2వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక- కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయ వచ్చన్నారు. మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్ సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లు కూడా యధా విధంగా జరుగుతాయి. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.

## ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

**విజయవాడ, మేజర్ న్యూస్ :** కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 202627 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (జనరల్, ఐఐటీనీట్) ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష 01.03.2026 తేదీన అత్యంత ప్రశాంతంగా, క్రమబద్ధంగా జరిగింది. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించబడ్డాయి.జిల్లా స్థాయి అధికారులు, పరిశీలకులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు సమయానికి హాజరై ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా పరిపాలన, పోలీస్ శాఖ, పరీక్షా సిబ్బంది, సంబంధిత అధికారులకు ఏ. మురళీ కృష్ణ, డీసీఓ ధన్యవాదాలు తెలియజేశారు.

## నేడు వినతుల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా, మార్చి 1, మేజర్ న్యూస్ :** మార్చి 2వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం... పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రెవెన్యూ క్లినిక్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వీవవఎశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని.. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చుని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



## మృతి చెందిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని మద్దతుగా మచిలీపట్నంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ

**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** అమెరికా ఇజ్రాయిల్ సంయుక్త దాడిలో మృతి చెందిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని మద్దతుగా మచిలీపట్నంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. ముస్లిం సంఘాలు మాట్లాడుతూ అన్వాయుధాల ఉత్పత్తిని నిలువురించే పేరుతో అగ్రరాజ్యం అమెరికా ప్రపంచంలో దాస్టికానికి పాల్పడుతుంది. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న మరణ హోమానికి సమాధానం చెప్పుకోవాల్సిన రోజు వస్తుంది. ముస్లిం సంఘాలు అప్రజాస్వామ్యంగా ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని... అతని కుటుంబ సభ్యులను హతమార్చడం దారుణం శాంతిని కాంక్షిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింల అభ్యున్నతికి ఇస్లాం మత ఔన్నత్యానికి ఖమేని విశేష సేవలందించారు. అమెరికా ఇజ్రాయిల్ దాడిలో మృతి చెందిన ఇరాన్ సుప్రీమ్ లీడర్ కమెని ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మచిలీపట్నం పురవీధుల్లో పెద్ద ఎత్తున ముస్లింలు నిరసన ర్యాలీ తెలిపారు. రహదారి వెంబడి అమెరికా అధ్యక్షుడు ట్రంప్.ఇజ్రాయిల్ అధ్యక్షుడు నేతన్యహు ఫోటోలను అంటించి తొక్కుతూ ముస్లిం సంఘాలు నిరసన తెలిపాయి.

## గన్నవరం నైపుణ్య కేంద్రంలో.. నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

### జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ



**గన్నవరం, మార్చి 1, మేజర్ న్యూస్ :** గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నైపుణ్య కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, ఐఏఎస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ నైపుణ్య కేంద్రంలో వినియోగదారుల సేవల సీనియర్ కార్య నిర్వాహకుడు శిక్షణ కోర్సు ఈ నెలలో ప్రారంభం కానుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిపుణుల ద్వారా శిక్షణ అందించి, స్థానిక పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణకు ఇంటర్మీడియట్, పారిశ్రామిక శిక్షణ(ఐ టి ఐ), డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల వారు పూర్తి వివరాల కోసం 90226 79999 నంబర్‌ను సంప్రదించి తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ఒక సామాజిక వర్గంపై బండారు ఆనందప్రసాద్ వ్యాఖ్యలు బాధాకరం



**పెడన మేజర్ న్యూస్:** ఇటీవల చేనేత కార్మికుల మంగళగిరి చేనేత గర్జన కార్యక్రమానికి ముందు పట్టణంలో జరిగినటువంటి సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బండారు ఆనందప్రసాద్ ఒక సామాజిక వర్గం గురించి మాట్లాడుతూ రైలు తగలబడితేనే స్పందిస్తారా డిప్యూటీ సీఎం పదవులు ఇస్తారా అని అనటం చాలా బాధాకరమని దానిని పూర్తిగా ఖండిస్తున్నామని జాతీయ కాపు సంఘం పెడన టౌన్ అధ్యక్షుడు కూనపురెడ్డి రంగయ్య అన్నారు. ఈ మేరకు కాపుల వీధి తమ నివాసం వద్ద పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కాపులు ఎప్పుడు కట్టుబడి ఉంటారని వారికి సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. గతంలో 1970లో తమ వీధిలోనే చేనేత మగ్గాలు ఉండేవని తోట నాగేశ్వరరావు అనే వ్యక్తి 150 మొగ్గలకు పైన కటక్ ఒరిస్సా సంబల్పూర్ లాంటి రాష్ట్రాలకు వ్యాపార మార్గాలను చూపించిన వ్యక్తి అని అన్నారు. విద్యావంతుడవై మున్సిపల్ చైర్మన్గా పనిచేసిన ఆనంద ప్రసాద్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇకపై సామాజిక వర్గాలపై వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రాయపురెడ్డి రమేష్ ముప్పిరి శెట్టి శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

# కలిసికట్టుగా ముందడుగు వేస్తేనే నవ సమాజ నిర్మాణం సాధ్యం




### నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్

### జనసేన కండువాలతో స్వాగతం పలికిన మండలి వెంకట్రామ్

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కలిసికట్టుగా ముందడుగు వేస్తేనే నవ సమాజ నిర్మాణం సాధ్యమని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. ఆదివారం చల్లపల్లి బస్టాండ్ సెంటరులో ఆర్య వైశ్య యువనేత, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఉరిమి మణికాంత్, ఏటీఎం సెంటరులో జనసేన పార్టీ మండల నాయకులు అనుమకొండ పూర్ణచంద్రశేఖర్ (ప్రెస్ పూర్ణ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యమి సభ్యత్వ నమోదు శిబిరాలను వెంకట్రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ పట్ల అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని తెలిపారు. పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు నియోజకవర్గంలో చేపట్టిన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రతి గ్రామంలో విశేష స్పందన లభిస్తోందన్నారు. మంచి ఆలోచనలతో ముందుకు వచ్చే యువత పార్టీలో ఉద్యమి సభ్యత్వం తీసుకుని నిస్వార్థ సేవాతత్పరులు పవన్ కళ్యాణ్ బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటరులో మణికాంత్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ సభ్యత్వం రెన్యూవల్స్ చేయించుకున్నారు. ఏటీఎం సెంటరులో ప్రెస్ పూర్ణ ఏర్పాటు చేసిన శిబిరంలో వక్కలగడ్డ నుంచి జనసేన పార్టీ నాయకుడు మట్టా చిన్నా ఆధ్వర్యంలో ఇరవై మంది ఎస్సీ మహిళలు జనసేన పార్టీలో చేరారు. వారికి మండలి వెంకట్రామ్ పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. ప్రెస్ పూర్ణ ఆధ్వర్యంలో బుల్లా కిషోర్, బత్తిన నాంచారయ్య అడపా బాబూరావు, తూములూరి సాయి కిరణ్, తూములూరి ప్రీతం, కే.పద్మజ లక్ష్మి తదితరులు వెంకట్రామ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారందరూ పార్టీ ఉద్యమి సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, మండల పార్టీ అధ్యక్షులు చోడగం విమల్ కృష్ణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట మురళీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, పూషడం సర్పంచ్ అంకం మారుతీరావు, ఏఎంసీ డైరెక్టర్ సూదాని నందగోపాల్, పార్టీ నాయకులు పసుపులేటి రవికుమార్, సోమిశెట్టి రాఘవ, గోళ్ళ ప్రసాద్, మిరియాల జితేంద్ర, కోనేరు శ్రీనివాసరావు, అడపా రమేష్, కూరేటి రాఘవ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో అబ్బురపరచిన సైన్స్ ఫెయిర్







విజయాడ, మేజర్ న్యూస్ : పటమట నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఆహుతులను అబ్బురపరిచిందని ఆర్ అండ్ డి సింహాద్రి తెలిపారు. నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సొంతంగా తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి, వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులు చేసేందుకు ఆశక్తి చూపడంతో వారి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటున్నారన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ముత్తారెడ్డి, హైస్కూల్ కోఆర్డినేటర్ హుస్సేన్, ప్రిన్సిపాల్ శామ్యూల్, అకడమిక్ డీన్ మౌనిక, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులు అభినందనలు తెలిపారు.



# విమానాశ్రయమునకు చేరుకున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

### ఘన స్వాగతం పలికిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు..





**గన్నవరం, మార్చి 1, మేజర్ న్యూస్ :** అమరావతి, ఎన్టీఆర్ జిల్లాలో పర్యటన నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం 1:35 విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు ఘన స్వాగతం లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దొనడి రమేష్, జస్టిస్ నినాల జయసూర్య, జస్టిస్ మహేశ్వరరావు కుంచెయం, జస్టిస్ టీసీడీ శేఖర్ విమానాశ్రయమునకు చేరుకోగా వారికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులతో పాటు కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి గోపి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, విమానాశ్రయం డైరెక్టర్ ఎం ఎల్ కే రెడ్డి, టెర్మినల్ ఇన్చార్జి అంకిత్ కుమార్, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, విమానాశ్రయం సిఎస్ఓ కె ధర్మేంద్ర తదితరులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగు చ్చాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమరావతికి బయలుదేరి వెళ్లారు.



# శ్రీ కొండలమ్మ సన్నిధిలో 20 వేలమంది భక్తులు







**గుడ్లవల్లేరు మార్చి 01 మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంనకు ఆదివారము ఆగుట వలన అధిక సంఖ్యలో షుమారు 15,000 మందికి పైగా భక్తులు శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకొనినారు. భక్తుల సౌకర్యార్ధం త్రాగునీరు, ఉచిత ప్రసాద వితరణ జరిగింది. దేవస్థానము పరిసరములను శుభ్రము చేయించి, బ్లీచింగ్ చల్లించటమయినది. శ్రీ అమ్మవారికి అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాలపొంగళ్లు సమర్పించారు. దేవస్థానము పరిసరములలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినారు. దేవస్థానం ఛైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, ఈవో ఆకుల కొండలరావు తమ సిబ్బందితో సహా శ్రీ అమ్మవారి దేవస్థానములో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీ కొండలమ్మ అమ్మవారి స్వయంభు దేవాలయంపై ఓంకారం త్రిశూలంతో లైటింగ్ బోర్డు ఏర్పాటు చేసిన దాతలు వెణుతురుమిల్లి గ్రామ వాస్తవ్యులు దాసరి భాస్కర్ రావు కుటుంబ సమేతంగా విచ్చేసినారు. వారికి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు విశేష పూజలు చేసి ఆశ్వీరవచనం చేసి శాలువాతో సత్కరించి, చిత్రపటం, ప్రసాదం అందజేసినారు. విజయవాడ వన్ టౌన్ సిఐ అద్దంకి ఉమా మహేశ్వర రావు కుటుంబ సమేతంగా విచ్చేసినారు. వారికి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు విశేష పూజలు చేసి ఆశ్వీరవచనం చేసి శేష వస్త్రంతో సత్కరించి, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

**భక్తులకు మనవి:** ది.03.03.2026 మంగళవారం మ.3.19 నిశ్రీశ్రీల నుండి రా.6.46 ని శ్రీశ్రీల వరకు గ్రస్తోదయ సంపూర్ణ చంద్ర గ్రహణం సంభవించినది. కావున శ్రీ అమ్మవారి దేవస్థానంను ఉదయం అర్చనలు, చండీ హోమం అనంతరం ఉదయం 10.00 ల నుండి ది.04.03.20206 బుధవారం ఉదయం సంప్రోక్షణ, నిత్య అర్చనలు అనంతరం 10.00 నుండి దర్శనం కల్పించబడును. కావున భక్తులు సహకరించగలరని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ఒక ప్రకటనలో తెలియజేశారు.

# అమరుల త్యాగాలతోనే ఎస్సీ వర్గీకరణ....

## మంద వేణు మాదిగ



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జరిగి రిజర్వేషన్ ఫలాలు 59 కులాలకు అందుతున్నాయి అంటే అమరుల త్యాగాలతోని సాధ్యమయ్యాయని గన్నవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ మంద వేణు మాదిగ అన్నారు. మార్చి 1 మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు విజయవాడ రూరల్ మండలం నున్నలో గ్రామంలో ఘనంగా అమరుల దినోత్సవం కార్యక్రమమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో ఎంతో మంది యువకులు ప్రాణత్యాగం చేయటం బాధాకరమని వారి ప్రాణ త్యాగంతో వచ్చిన వర్గీకరణ ఫలాలు నేడు అందరికీ అందుతున్నాయి అని వారి త్యాగం ఎప్పటికీ మరువబొమని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ వాడ రూరల్ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొక్కిలిగడ్డ కమల్ రాజు మాదిగ, ఎం ఎస్ పి అధ్యక్షులు పోరిటిగడ్డ దేవదాసు మాదిగ, నున్న గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ప్రత్తిపాటి బుచ్చయ్య మాదిగ, సూరంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, 12వ వార్డు సభ్యులు పత్తిపాటి సుందరయ్య, తెలుగుదేశం పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు బోకినెల తిరుపతిరావు, జడ్పీహెచ్ఎస్ స్కూల్ పేరెంట్స్ చైర్మన్ గడ్డం కుమార్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు గోన్నూరు సీనయ్య, ఉయ్యూరు రాజశేఖర్, పరస చైతన్య,గడ్డం ప్రవీణ్ పరస సురేష్ మొదలగు వారు పాల్గొన్నారు.



## నాంచారమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తి

**కోడూరు మేజర్ న్యూస్ :** కృష్ణా నది తీరాన కొలువై ఉన్న విశ్వనాథపల్లి శ్రీ అద్దంకి నాంచారమ్మ జాతర ఏర్పాట్లు పూర్తయ్యాయి సోమవారం అమ్మవారికి విశేష అలంకరణ చద్ది నైవేద్యాల సమర్పణ ఉంటుందని ఆలయ చైర్మన్ నరసింహారావు తెలిపారు. మంగళవారం ప్రధాన జాతర జరగడంతో భక్తులు సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రాజశేఖర్ సేవలు అభినందనీయం



**పామర్రు మేజర్ న్యూస్ :** ఉద్యోగ విధులతో పాటు సమాజం పట్ల నైతిక బాధ్యతను కలిగి ఉండటం అభినందనీయమని అందుకు ఉదాహరణ మద్దాలి రాజశేఖర్ అని పామర్రు మండల విద్యాశాఖ అధికారి-2 జి.పద్మ వాణి పేర్కొన్నారు. పామర్రు అరండల్ పేట-1 మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయ విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ పొందిన మద్దాల రాజశేఖర్ అభినందన కార్యక్రమం అదే పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా ఉద్యోగ బాధ్యతలలో ఎటువంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వహించడమే కాకుండా విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకంగా ఉన్న పలు సమస్యల పరిష్కారానికి కృషిచేసిన రాజశేఖర్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు మాజీ ఎంపీపీ దేవరపల్లి రామకోటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మూడెడ్ల వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్ పి.ఎం.ఎస్ప్రసాద్, మానవత సంస్థ అధ్యక్షుడు నూతలపాటి తారక రామారావు (ఎన్టీఆర్) పామర్రు మండల యుటిఎఫ్ అధ్యక్షుడు అంక రవి, పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కొనసాగుతున్న 263 వ వార్షిక కళ్యాణోత్సవాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నాలుగోరోజైన ఆదివారం ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శన, హరికథ గానం రక్తికట్టించాయి.. శ్రీ శివ లలితా భరతనాట్య కళాకేంద్రం నిర్వాహకురాలు పిండి మల్లిక ఆధ్వర్యంలో సతీష్ కుమార్, జ్ఞానేశ్, యోచిత, వేదశ్రీ, దేదీప్య, పూజ శ్రీ, గౌతమి, తన్మయి, లాస్య, కీర్తన,స్పందన పలుఅంశాలను ప్రదర్శించారు. మొగిలిచర్ల నాగమణి భాగవతారిణిచే శివ పార్వతుల కళ్యాణంహరికథాగానం శ్రవణానందకరంగా సాగింది. దేవాలయ పాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం సూచనతో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాజగోపాల్ స్వామి మందిర నిర్వాహకులు ఎస్.ఎస్.ఆర్.ఆంజనేయులు వ్యాఖ్యాతగా వ్యవహరించి పర్యవేక్షించారు.



## ఏఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ 38వ క్రీడా, సాహితీ దినోత్సవ సంబరాలు



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : స్థానిక గుడ్లవల్లేరు ఏఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ ఆర్ హైస్కూల్లో క్రీడా, సాహితీ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గుడివాడ ఎస్ ఎల్ ఆర్ సోమేశ్వ రరావు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యా



ర్థులను ఉద్దేశించి చదువుతోపాటు శారీరక దృఢత్వం ఎంతో అవసరమని, ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యం పెరుగుతుందని, విద్యార్థులకు తెలియజేశారు. పెదపారుపూడి డిప్యూటీ ఎం.పి.డి.వో వంగ శ్రీనివాస్( వంశీ ) గౌరవ అతిథిగా విచ్చేసి సాహిత్యం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ చక్కని పాటలతో, జానపదాలతో, సామెతలతో విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి ఎలా పెంచుకోవాలో, తల్లిదండ్రుల ప్రాముఖ్యం వివరించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ వి.శిరోమణి పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు కవుల వేషధారణ శాస్త్రీయ నృత్యం పాటలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎన్. శ్రీనివాస్ మూర్తి, ప్రిన్సిపాల్ వి ఏ కుంజుమన్,వైస్ ప్రిన్సిపాల్ సత్య బాబు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## ఘనంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



పామర్రు మేజర్ న్యూస్ : మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం వేడుకలను పామర్రు సెంటర్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాదిగ మహిళ జిల్లా అధ్యక్షురాలు డి.శిరీష ఈ సందర్భంగా మాట్లాడుతూ 32 సంవత్సరాల ఉద్యమ చరిత్రలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ఉద్యమాన్ని కొనసాగిస్తున్న మంద కృష్ణ మాదిగ ఉద్యమ స్ఫూర్తిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షులు సిద్దెల జయరాజ్, నియోజకవర్గం అధ్యక్షులు మునిపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షులు జవ్వలపూడి భాస్కరరావు, సీనియర్ నాయకులు ఆర్. వెంకటేశ్వరరావు, కొడమంచిలి ప్రసాద్, చీలి రమేష్, చాట్ల సుధీర్ తదితరులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

## మయూంకా బివి సిట్స్ యూత్ ఫెస్ట్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులకు బహుమతులు



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : అమలాపురంలోని బోనం వెంకట చలమయ్య ఇన్స్టిట్యూట్ అండ్ టెక్నాలజీ (అటానమస్) లో ఫిబ్రవరి 27, 28 తేదీలలో నిర్వహించిన "మయూంకా బివి సిట్స్ జాతీయ స్థాయి యూత్ ఫెస్ట్ – 2026" వేడుకలు ఉత్సాహ భరితంగా జరిగాయి. ఈ వేడుకల్లో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ క్రీడా పోటీలలో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. బాలుర విభాగం బాల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలు, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ విజేత, టేబుల్ టెన్నిస్ డబుల్స్ రన్నర్స్, బాలికల విభాగం బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలు, బ్యాడ్మింటన్ సింగిల్స్ విజేత, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ రన్నర్స్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, క్రీడలలో విద్యార్థులు ప్రదర్శించిన క్రమశిక్షణ, జట్టు భావన, పట్టుదల అభినందనీయమని తెలిపారు.

బాలుర, బాలికల విభాగాల్లో విజేత లుగా నిలిచి నగదు బహుమతులు, షీల్డులు, మెమెంటోలు అందుకోవడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఇలాంటి అంతర్ కళాశాల స్థాయి పోటీల్లో విజయం సాధించడం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడు తుందని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారిని ప్రోత్సహించిన క్రీడా ఉపాధ్యాయులను కూడా అభినందించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికి ప్రత్యేక శిక్షణను అందించిన ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ ఎమ్.భవదీప్ లను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీ & కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో సెక్రెటరీ & కరస్పాండెంట్ వల్లూరిపల్లి రామకృష్ణ, ఎక్సు క్యూటివ్ మెంటర్ ఎన్.ఎస్.ఎస్.వి. రామాంజనేయులు, విభాగాధిపతులు, ప్రిన్సిపాల్ అభినందించారు.

## యువ న్యాయవాది శ్రీకాంత్‌కు తాడంకి నూతన రామాలయంలో ఘన సత్కారం



పమిడిముక్కల మేజర్ న్యూస్: ఉయ్యూరుకు చెందిన యువ న్యాయవాది జంపాన శ్రీకాంత్ ఇటీవల రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో రాష్ట్రంలో మూడో ర్యాంక్ సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటుకున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని తాడంకి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠలు జరిగిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయానికి ఆదివారం కుటుంబ సభ్యులతో విచ్చేసి స్వామివారిని దర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సత్కారం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి శేష వస్త్రాలతో శ్రీకాంత్ దంపతులను, ఆయన తల్లిదండ్రులు జంపాన కొండలరావు, మాలతీరాణి లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ హైకోర్టు న్యాయవాదిగా రాణిస్తూ వృత్తిపరంగా మరింత ఎదిగే లక్ష్యంతో కష్టపడి చదివి ఉన్నత ఫలితం సాధించడం ద్వారా మన ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చారని న్యాయవాది శ్రీకాంత్ ను ప్రశంసించారు. ఇలాంటి విజయాలు యువతకు ప్రేరణగా నిలుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. తొలుత శ్రీకాంత్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం మాట్లాడిన న్యాయవాది శ్రీకాంత్ తన విజయానికి తల్లిదండ్రులు, గురువులు, పెద్దల ప్రోత్సాహమే కారణమని అన్నారు. రాబోయే డిజిటల్ యుగంలో కార్మిక చట్టాలు, వారి హక్కులపై పూర్తి విశ్లేషణ చేసి, ఆయా చట్టాల మీద పి.హెచ్.డి. చేయనున్నట్టు శ్రీకాంత్ తెలిపారు. సత్కరించిన ఆలయ కమిటీకి, గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

### బీచ్ ఇసుక ఖనిజాలలో 25%తో, చైనా ఆధారపడటాన్ని తగ్గించడానికి

# ఆంధ్రప్రదేశ్ అరుదైన భూమిని జాబితా చేస్తుంది

విజయవాడ, ఫిబ్రవరి 28, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ తన విస్తారమైన బీచ్ ఇసుక నిల్వల ఆర్థిక సామర్థ్యాన్ని అన్‌లాక్ చేయడం ద్వారా అరుదైన భూమి, టైటానియం ఆధారిత ఖనిజాలలోకి వ్యూహాత్మక ప్రవేశాన్ని సిద్ధం చేస్తోంది – ఇది చైనా ఆధిపత్య ప్రపంచ సరఫరా గొలుసులపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించడం, రాష్ట్ర తీరప్రాంతంలో కొత్త దిగువ తయారీ కేంద్రాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్న చర్య. ప్రభుత్వ–మైనింగ్ ప్రధాన ఏపిఎండిసి యొక్క వివరణాత్మక ప్రదర్శన ప్రకారం, ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో రెండవ అత్యధిక బీచ్ ఇసుక ఖనిజ నిల్వలను కలిగి ఉంది, ఇది జాతీయ వనరులలో దాదాపు 25 శాతం వాటాను కలిగి ఉంది, ముఖ్యంగా ఇల్మెనైట్, రూటిల్, జిర్కాన్, మోనాజైట్ యొక్క అధిక సాంద్రతలతో – చివరికి అరుదైన భూమి మూలకాల (ఆర్ఇఇఎస్) యొక్క కీలక వనరు.

### అధిక పారిశ్రామిక డిమాండ్ ఉన్న వ్యూహాత్మక ఖనిజాలు

బీచ్ ఇసుక ఖనిజాలు పెయింట్స్, ఏరోస్పేస్ భాగాల నుండి విద్యుత్ వాహనాలు, విండ్ టర్బైన్లలో ఉపయోగించే అణు ఇంధనం, శాశ్వత అయస్కాంతాల వరకు అధిక–విలువైన పరిశ్రమల శ్రేణిలో కీలకమైన ఇన్‌పుట్‌లు. ఇల్మెనైట్, రూటైల్‌లను టైటానియం డయాక్సైడ్ పిగ్మెంట్, టైటానియం లోహంగా ప్రాసెస్ చేస్తారు, అయితే మోనాజైట్ ఎలక్ట్రానిక్స్, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు అవసరమైన అరుదైన ఎర్త్ ఆక్సైడ్‌లను ఉత్పత్తి చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఈ చర్య తీసుకున్న సమయం వ్యూహాత్మకమైనది. చైనా ప్రస్తుతం ప్రపంచ టైటానియం ఖనిజ ఉత్పత్తిలో సగానికి పైగా ఆధిపత్యం చెలాయిస్తోంది, అరుదైన ఎర్త్ ప్రాసెసింగ్ సామర్థ్యంలో 90 శాతానికి పైగా నియంత్రిస్తుంది, ఇది భారత దేశం వంటి దిగుమతి చేసుకునే దేశాలకు గణనీయమైన సరఫరా దుర్బలత్వాలను సృష్టిస్తుంది. భారతదేశం ఇప్పటికే దాని టైటానియం డయాక్సైడ్ పిగ్మెంట్ అవసరాలలో 75 శాతానికి పైగా దిగుమతి చేసుకుంటుంది, దాదాపు మూడింట రెండు వంతులు చైనా నుండి తీసుకోబడ్డాయి, ప్రపంచంలోనే అతిపెద్ద టైటానియం ఖనిజ నిల్వలు ఉన్నప్పటికీ.

### రేర్ ఎర్త్ అయస్కాంతాలు - వేగంగా అభివృద్ధి చెందుతున్న అవకాశం

రేర్ ఎర్త్ అవకాశం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఇవి మోటార్లు, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, రక్షణ పరికరాలు, వినియోగదారు ఎలక్ట్రానిక్స్‌కు కీలకమైన అరుదైన ఎర్త్ శాశ్వత అయస్కాంతాల డిమాండ్ భారతదేశంలో ఏటా 15 శాతానికి పైగా పెరుగుతుందని అంచనా వేయబడింది, మొత్తం డిమాండ్ 2030 నాటికి రెట్టింపు అవుతుందని అంచనా. ప్రస్తుతం, భారతదేశం అరుదైన ఎర్త్ పదార్థాలు, పూర్తయిన అయస్కాంత ఉత్పత్తుల కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది, తయారీదారులను భౌగోళిక రాజకీయ, సరఫరా గొలుసు షాక్‌లకు గురిచేస్తుంది.

### ఏపిఎండిసి పెద్ద ఎత్తున మైనింగ్ ప్రోత్సాహాన్ని కొనసాగిస్తోంది

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి, ఏపిఎండిసి ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, కృష్ణ వంటి తీరప్రాంత జిల్లాల్లో 10 ప్రధాన బీచ్ ఇసుక నిక్షేపాలకు అనుమతులను పొందింది, ఇవి వేల హెక్టార్లను కలిగి ఉన్నాయి, పదిలక్షల టన్నుల భారీ ఖనిజ నిల్వలను కలిగి ఉన్నాయి. అనేక అదనపు బ్లాక్‌లు అభివృద్ధిలో ఉన్నాయి లేదా అధునాతన క్లియరెన్స్ దశల్లో ఉన్నాయి. అధికారులు ఈ నిక్షేపాలను కేవలం మైనింగ్ ఆస్తులుగా కాకుండా, ఖనిజ విభజన, శుద్ధి నుండి టైటానియం ఉత్పత్తులు, అరుదైన భూమి ఆధారిత భాగాల అధునాతన తయారీ వరకు పూర్తి విలువ గొలుసుకు పునాదిగా చూస్తారు.

### తీరప్రాంత విలువ-జోడింపు కారిడార్‌ను నిర్మించడం

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ వ్యాపార కేసును బలపరుస్తుంది. రాష్ట్రంలో 330 మిలియన్ టన్నులకు పైగా కార్గో సామర్థ్యంతో ఆరు కార్యాచరణ ఓడరేవులు, వైజాగ్–చెన్నై పారిశ్రామిక కారిడార్ వంటి పారిశ్రామిక కారిడార్‌లను విస్తరిస్తోంది, ఖనిజాలు అధికంగా ఉన్న తీరప్రాంత బెల్ట్‌ల సమీపంలో బలమైన లాజిస్టిక్స్, విద్యుత్ మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ సామీప్యత భారీ ఖనిజ ప్రాసెసింగ్ ప్లాంట్లు, వర్ణద్రవ్యం సౌకర్యాలు, టైటానియం మెటల్ యూనిట్లు, అరుదైన భూమి శుద్ధి సమూహాలను ముడి పదార్థాల వనరులకు దగ్గరగా ఉంచడానికి అనుమతిస్తుంది, లాజిస్టిక్స్ ఖర్చులను బాగా తగ్గిస్తుంది.

### దిగుమతులను తగ్గించడం, వ్యూహాత్మక ఖనిజాల కేంద్రంగా సృష్టించడం

పరిశ్రమ విశ్లేషకులు చెబుతున్న దాని ప్రకారం ఆంధ్రప్రదేశ్ బీచ్ ఇసుక వ్యూహం, క్లీన్ ఎనర్జీ, రక్షణ కార్యక్రమాల కింద కీలకమైన ఖనిజ భద్రత, దేశీయ తయారీ కోసం దేశం యొక్క విస్తృత ప్రోత్సాహంతో దగ్గరగా ఉంటుంది.

### స్కేల్‌గా అమలు చేస్తే, రాష్ట్రం భారతదేశ ప్రాథమిక కేంద్రంగా ఉద్భవించగలదు:

- టైటానియం డయాక్సైడ్ వర్ణద్రవ్యం, టైటానియం లోహం
- అరుదైన భూమి ఆక్సైడ్‌లు, శాశ్వత అయస్కాంతాలు
- ఏరోస్పేస్, ఇవిలు, పునరుత్పాదక ఇంధన వనరుల కోసం అధునాతన పదార్థాలు

దిగుమతి ప్రత్యామ్నాయానికి మించి, ప్రపంచ తయారీదారులు కీలకమైన ఖనిజాల కోసం చైనీస్ కాని సరఫరా గొలుసులను కోరుకుంటున్నందున ఈ రంగం గణనీయమైన ఎగుమతి ఆదాయాలను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా, ఆంధ్రప్రదేశ్ తన తీరప్రాంతాన్ని మైనింగ్ బెల్ట్‌గా మాత్రమే కాకుండా – భారతదేశం యొక్క తదుపరి పారిశ్రామిక వృద్ధికి శక్తినిచ్చే వ్యూహాత్మక పదార్థాల కారిడార్‌గా ఉంచుతోంది. మరిన్ని వివరాల కోసం, సంప్రదించండి: సుశాంత సుబుధి, ఓఎస్డి మీడియా రిలేషన్స్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

9701512346 susantaosdmr@gmail.com

# కొణిజేటి రోశయ్య జీవితం ఆదర్శప్రాయం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ఆర్థికమంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నరుగా పని చేసిన కొణిజేటి రోశయ్య జీవితం ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామసత్యనారాయణ అన్నారు. చల్లపల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురం సెంటరులో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహావిష్కరణ ఆదివారం జరిగింది. రోశయ్య విగ్రహాన్ని చిన్ని రామసత్యనారాయణ ఆవిష్కరించారు. వివాద రహితునిగా రోశయ్య రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపును పొందారనీ, ఆర్యవైశ్యులకు రోశయ్య స్ఫూర్తి అని తెలిపారు. చల్లపల్లి మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు బొగ్గవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లాసంఘ అధ్యక్షులు సన్నిధి నాగసాయి శ్రీనివాసు, బందరు మ ఎన్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి వెంకట బాబాప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాలు బాబు, చల్లపల్లి అధ్యక్షులు అన్నవరపు పాండురంగారావు, జిల్లా సంఘ నేతలు ఘంటసాల రాజామోహనరావు, కొల్లిపర సురేంద్రబాబు, మానేపల్లి రఘురాం, జూపూడి సాయి, మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు, ఉపసర్పంచ్ మువ్మనేని నాని, విగ్రహ దాతలు బొగ్గవరపు మదుసూధనరావు వారి సోదరులు, స్థానిక నేతలు వరదా హరిగోపాల్, తమ్మన సతీష్, మానేపల్లి సత్యసాయిలతోపాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, చల్లపల్లి మండలంలోని ఆర్యవైశ్య సంఘీయులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలుత రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు నివాళులు అర్పించగా, వాసవీమాత పతాకాన్ని ఆవిష్కరించారు.

# భక్తులకు మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన

**పెనుగంచిప్రోలు, మార్చి 01, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు రాచకొండ ప్రభాకర్ ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిపోలు శ్రీ తిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి జాతరకు వచ్చే భక్తులకు గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ కు వ్యతిరేకంగా మత్తు బారిన పడి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్న యువతకు, భక్తులకు సందేశాలతో అవగాహన కల్పిస్తూ మత్తు రహిత సమాజ స్థాపన కోసం తనవంతు కృషి చేస్తున్నారని అన్నారు. జాతరలు ఉత్సవాలు వారాంత సంతలో, రద్దీగా ఉన్న ప్రాంతాల్లో సెలవు రోజులలో ఖాళీ సమయంలో మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా జనచైతన్యం చేస్తూ యువతకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా అని అన్నారు. మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల శారీరక మానసిక ఆరోగ్య ఆర్థిక సమస్యలు, ప్రమాదాలు అగత్యాలు ఎన్నో జరుగుతాయని అన్నారు. అందుకనే విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ప్రణాళిక బద్ధంగా కష్టపడి లక్ష్యాన్ని సాధించాలని అని అన్నారు. తల్లిదండ్రులకు గురువులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా కోరడం జరిగిందని అన్నారు. ధూమపానం మద్యపానం ఆరోగ్యానికి హానికరం నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచుతూ చేతిలో మైక్ పట్టుకుని ఫ్లెక్సీతో విచిత్ర వేషధారణతో ప్రచారం చేస్తూ రాష్ట్రం మొత్తం గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. అలానే రోడ్డు భద్రత నియమాలు పాటించి క్షేమంగా గమ్యాలని చేరుకోవాలని కోరుకోవడం జరిగిందని ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది స్థానికులు తదితరులు పాల్గొన్నారు.




## పామర్తి కుటుంబానికి కొడాలి ఆశీర్వచనం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మండలంలోని వెణుతురుమిల్లి శివారు దేశాయి గుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఆ గ్రామ మాజీ సర్పంచి పామర్తి వీర వెంకట రామ్మోహనరావు కుమారుడు కిరణ్కుమార్కు ఆదివారం జరిగిన నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమంలో మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో వేముల భాను హనుమాన్ ప్రసాద్, గుడివాడ నియోజకవర్గ నాయకులు పాలేటి చంటి, గొర్ల శ్రీను, చుండూరు శేఖర్, కొంకితల ఆంజనేయ ప్రసాద్, కాకొల్ల ప్రసాద్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, మండల యువజన సంఘాధ్యక్షుడు గుదే రవి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు పడమట సుజాత, పార్టీ యువజన జిల్లా కార్యదర్శి మిరియాల బాబు రాజేంద్ర ప్రసాద్, పార్టీ నాయకులు కుందేటి ఫణి, బాడిగ నాని, శాయన దుర్గాప్రసాద్, నిడుమోలు పెద్దులు, పామర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



## భవిష్యత్తు పాఠశాలలో బలమైన పునాదులు వేయాలి

**కొండపల్లి మేజర్ న్యూస్ :** విద్యార్థుల ఎదుగుదలకు ఉజ్వల భవిష్యత్తుకు స్కూల్లోనే పునాదులు వెయ్యాలని సూచించారు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య శనివారం సాయంత్రం కొండపల్లిలోని రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ 15వ వార్షికోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు జంపాల సీతారామయ్య, కొండపల్లి రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు సృజనాత్మకత, విలువలతో కూడిన నాణ్యమైన విద్యను బోధిస్తూ ఉంటున్నారు. విద్యార్థులు మార్కులు, ర్యాంకులే కాకుండా మంచి విలువలు, సంస్కారం, కట్టుబాట్లతో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కొండపల్లి మున్సిపల్ చైర్మన్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక నాయకుడు శ్యామ్‌కి తగిన గౌరవం, గుర్తింపు ఈ పదవి



**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన రెంటపల్లి శ్యామ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మెంబర్ గా ప్రభుత్వ నామినేటెడ్ పదవిలో నియమితులైన తెలుగుదేశం పార్టీ కార్మిక విభాగం టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి & జోన్ – 3 ఇంచార్జ్, రాష్ట్ర ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ అయిన రెంటపల్లి శ్యామ్ ని మర్యాదపూర్వకంగా కలిసి దృశ్యాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా బురుసు శివ మాట్లాడుతూ రెంటపల్లి శ్యామ్ సామాన్య కుటుంబంలో పుట్టి తెలుగుదేశం పార్టీలో 30 సంవత్సరాల పైగా సేవలందించి ఒక నిబద్ధత కలిగిన నాయకునిగా కార్మికుల పక్షపాతిగా అనునిత్యం కార్మిక సమస్యలపై పోరాటం చేస్తూ కార్మికుల హక్కులకై వారి శ్రేయస్సుకే శ్రమిస్తూ అంచలంచెలుగా ఎదిగి టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జోన్ 3 ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్యామ్ టిడిపి పార్టీకి, కార్మిక విభాగానికి అతను చేసిన సేవలను గుర్తించి ఈరోజు తెలుగుదేశం పార్టీ అధిష్టానం కూటమి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ నామినేటెడ్ పదవిని ఇచ్చి గౌరవించిన శుభ సందర్భంగా వారిని కలిసి అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త టిడిపి సీనియర్ నాయకులు దొప్పల బుజ్జిబాబు, టి ఎన్ టి యు సి మైలవరం నియోజవర్గం అధ్యక్షులు బురుసు శివ, జనసేన పార్టీ నాయకులు రెంటపల్లి లక్ష్మణ్, శాంతి వర్ధన్, రెంటపల్లి నవీన్ తదితరులు కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన మాట గెలిచాక మారుస్తున్నారని అనిల్ ఆరోపణ



**పామర్రు మేజర్ న్యూస్ :** కూటమి నేతలు ఎన్నికలలో గెలవక ముందు ఒక మాట, గెలిచాక మరోమాట చెబుతున్నారని పామర్రు నియోజవర్గ మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే రూటే సపరేటు అనే విధంగా పాలన ఉన్నదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో పామర్రు గ్రామంలో ప్రతి ఒక్కరికి మూడు సెంట్ల స్థలం ఉచితంగా అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే మాట ఇవ్వడం జరిగిందన్నారు. కానీ గెలిచాక టిడ్కో ఇళ్లు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నామని కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరుతూ సోమవారం ఉదయం 10 గంటలకు తమ పార్టీ నాయకులతో కలిసి పామర్రు తహసిల్దారుకు వినతిపత్రం అందజేయనున్నట్లు అనిల్ కుమార్ తెలిపారు. పామర్రులోని పార్టీ కార్యాలయం నుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శనగా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందిస్తామని తెలిపారు.

## దేవస్థానం అభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలి



**కోడూరు మేజర్ న్యూస్ :** దేవస్థానం అభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ కోరారు. ఆదివారం సాయంత్రం కోడూరు మండలం పిట్టల్లంకలోని ఉభయ నాగేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. నూతన ధర్మకర్తల మండలి చైర్మనుగా బండే కొండలరావు, సభ్యులుగా చింతా వరలక్ష్మి, చింతా వెంకటేశ్వరమ్మ, బావిశెట్టి శివ నాగమల్లేశ్వరరావు, కొప్పుల నరసింహారావు, తెనాలి లక్ష్మి రత్నకుమారి, అట్లూరి తులసికృష్ణ, సన్నిధిరాజు స్వర్ణ కుమారిలతో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ కే.శ్రీనివాసరావు, ఈఓ సీహెచ్ సుధాకరరావు ప్రమాణ స్వీకారం చేయించగా, ముఖ్య అతిథి వెంకట్రామ్ వారిని ఘనంగా సత్కరించారు. నీటి సంఘం ఉపాధ్యక్షులు గాదె భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మర్రె గంగయ్య, మాజీ సర్పంచ్ బడే నాగరాజు, బడే వెంకట్రావు, విశ్వనాధపల్లి దేవస్థానం డైరెక్టర్ తోట సోమశేఖర్, నాయకులు కంచర్లపల్లి వెంకటరమణ, బండే సీతారామయ్య, పూతబోయిన సీతా రత్న సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరుని సన్నిధిలో జగజ్యోతి



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నాట్య క్షేత్రంకూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న 263వ వార్షిక కళ్యాణ మహోత్సవం వేడుకలలో భాగంగా ఆదివారం సాయంత్రం జగజ్యోతి, ఎదుర్కోలు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. జగజ్యోతి కార్యక్రమాన్ని వైదిక రత్న శతాధిక ప్రతిష్టాచార్యులు పూర్ణ దీక్షాపరులురాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి (మచిలీపట్నం) శిష్యుల వేదమంత్రాలమధ్య మంగళ వాయిద్యాల నడుమ శాశ్వత ఉభయదాతలు భాగవతుల వెంకట సత్య సేతురామశర్మ –లక్ష్మీ కనకదుర్గ దంపతులు, నాగ సాయి మోహిత్ రామ్–అనంత్ ఆండాళ్ శ్రీలేఖ దంపతులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఎదుర్కోలుత్సవాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠం పూర్వపు ప్రధాన ఆచార్యులు కళా రత్న డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, విశ్రాంత ఉపాధ్యాయులు చింతలపాటి రామకృష్ణ ఉభయ రోక్తుల నడుమ సోమయాజుల మురళీకృష్ణ శర్మ కనకదుర్గ దంపతుల ఇంటి వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రామలింగేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు నిర్వహించారు.

# శ్రీ చైతన్య స్కూల్‌లో సైన్స్ ఎక్స్ పో





**పోరంకి, మేజర్ న్యూస్ :** శ్రీ చైతన్య స్కూల్ పోరంకి శాఖలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సైన్స్ ఎక్స్ పో విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించారు. సైన్స్ పట్ల విద్యార్థులు ఆసక్తిని కనపరచాలని, పిల్లలలోని సృజనాత్మకతను వెలికితీయాలని ఆయన సూచించారు. దాదాపుగా 280 ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. శ్రీ చైతన్య విద్యార్థులను ఆయన అభినందించారు.

పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అజ్ఞాన అంధకారాన్ని తరిమి కొట్టే శక్తి సైన్స్‌కు ఉందని, విద్యార్థుల అద్భుతమైన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి అభినందనీయమని వివరించారు. పాఠశాల ఆర్ఐ ధీరేంద్ర ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్.సురేష్ బాబు మాట్లాడుతూ వైజ్ఞానిక విజ్ఞానం కూడా పిల్లలకు అవసరం అని, అందుకు శ్రీచైతన్య సంస్థ సహకారం చెప్పుకోదగినది అని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌ని యాజమాన్యం సత్కరించి గౌరవించింది. ఈ కార్యక్రమంలో ఈ.జి.యం మురళీకృష్ణ, ఆర్ఐ, ధీరేంద్ర, కోఆర్డినేటర్ సురేష్ బాబు, డీన్, ఇంచార్జులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సుధాకర్ మహీత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఘనంగా నేషనల్ సైన్స్ డే






**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** బాలాజీ నగర్ సుధాకర్ మహీత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా గొప్ప విజ్ఞాన ప్రద ర్శన చక్కగా నిర్వహించబడింది విద్యార్థులు విజ్ఞాన శాస్త్రం, గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రం నుండి కథలు చదవడం వాటి ప్రాముఖ్యత, మెదడు నరాల యొక్క పనితీరుని వివరించుట, మాక్ అసెంబ్లీ, ఆర్ట్ అండ్ కల్చర్ ద్వారా ప్రముఖ దేవస్థానాల నిర్మాణ నమూనాలు, పైథాగరస్ తీరం, ఎలక్ట్రానికల్ మాగ్నెటిక్స్ ఇలా రకరకాల అంశాలను తీసుకుని వాటిని మన రోజువారి ప్రక్రియలో ఎలా వాడుతామో ప్రాజెక్టు రూపంలో తయారుచేసి ప్రదర్శించారు ఎంతో ఆసక్తికరంగా ఆకర్షణీయంగా వివరించారు పాఠశాలలో నిర్వహించిన ప్రదర్శనలో డైరెక్టర్ జె.సుధాకర్ రెడ్డి ప్రిన్సిపల్ డి వరలక్ష్మి ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రాచీన కళలు మానసికోల్లాసానికి వారధులు


**ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రాచీన కళలు ప్రతి ఒక్కరికీ మానసికోల్లాసాన్ని ఇస్తాయని ఎన్. టి.ఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.. ఆదివారం ఆయన ఆర్టిజో ఫైన్ ఆర్ట్స్ స్టూడియోలో నిర్వహిస్తున్న పోటరీ అండ్ పాట్ పెయింటింగ్ వర్క్ షాప్‌ను సందర్శించారు. పిల్లలు, పెద్దలు అందరూ స్క్రీన్ టైంని తగ్గించుకొని సృజనాత్మకతను పెంపెందించుకునేందుకు పోటరీ, పాట్ పెయింటింగ్ వర్క్ షాప్‌లు దోహదపడతాయని అన్నారు. అంతే కాకుండా హ్యాండ్ అండ్ మైండ్ కో ఆర్డినేషన్, హ్యాండ్ బిల్డింగ్ స్కిల్స్ డెవలప్మెంట్‌కి ఉపయోగపడతాయన్నారు. విజయవాడ నగర కళాప్రియుల కోసం వినూత్న రీతిలో పలు సృజనాత్మక కళాత్మక కార్యక్రమాలను రూపొందిస్తున్న ఆర్టిజో మేనేజ్మెంట్‌ని ఆయన అభినందిస్తూ సమ్మర్ క్యాంప్ బ్రోచర్‌ని ఆవిష్కరించారు. అనంతరం ఆర్టిజో ఫైన్ ఆర్ట్స్ స్టూడియో ప్రిన్సిపల్ స్ఫూర్తి శ్రీనివాస్, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ అమర దీప్తి కలెక్టర్‌ని గౌరవంగా సత్కరించారు.

### రంజాన్ మాసంలో కల్పించాల్సిన సౌకర్యాలపై

## అధికారులతో కలెక్టర్ సమీక్ష

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ పర్వదినం పురస్కరించుకొని జిల్లాలోని ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా వారు నివసించే ప్రాంతాలు, మసీదులు ప్రార్థన మందిరాలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా మంచి నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై వివిధ శాఖల జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్న పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారు నివసించే ప్రాంతాల్లోనూ మసీదులు, ప్రార్థన మందిరాలలో వద్ద మంచినీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలన్నారు. మసీదులు, ప్రార్థన మందిరాలు, ఈద్గాల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలలో పనిచేసే కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు ముస్లిం ఉద్యోగులు అందరూ పవిత్ర రంజాన్ మాసంలో నమాజ్ చేయుటకు వీలుగా ఈనెల 19వ తేదీ వరకు అన్ని పని దినాలలో ముగింపు సమయానికి ఒక గంట ముందుగా



సంబంధిత కార్యాలయము లేదా పాఠశాలను వదిలి వెళ్ళుటకు ప్రభుత్వం అనుమతించిందని కలెక్టర్ వివరించారు. ముస్లింల సౌకర్యం కోసం రాత్రులు అంగళ్ళు, కూరగాయల మార్కెట్లు, హోటల్లు తెరిచి ఉంచేలా పోలీసులు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. ఈ జూమ్ సమావేశంలో, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రబ్బాని, మచిలీపట్నం, గుడివాడ ఉయ్యూరు ఆర్డీవోలు సాంబశివరావు,,బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్, డిఎంహెచ్వో డాక్టర్ యుగంధర్, డిఎస్ఓ మోహన్ బాబు, జెడ్పిసిఈఓ కన్నమ నాయుడు, డిపిఓ అరుణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, కార్మిక శాఖ అధికారి విష్ణు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసు రత్నం, డిఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు డైరెక్టర్‌గా రెంటపల్లి శ్యామ్




**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ డైరెక్టర్‌గా రెంటపల్లి శ్యామ్‌ను ప్రభుత్వ నామినేటెడ్ పదవిలో నియమించిన ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం. రెంటపల్లి శ్యామ్ తెలుగుదేశం పార్టీ కార్మిక విభాగం తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టి ఎన్ టి యు సి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జోన్ 3 ఇంచార్జ్ రాష్ట్ర ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్‌గా గత 30 సంవత్సరాల పైగా సేవలందిస్తున్న అతని పనితీరును చూసి టిడిపి అధిష్టానం నేడు ఈ పదవిని ఇచ్చి గౌరవించింది. ఈ సందర్భంగా రెంటపల్లి శ్యామ్ మాట్లాడుతూ నాకు ఈ పదవిని ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడుకి, పవన్ కళ్యాణ్‌కి, నారా లోకేష్‌కి, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని)కి, మైలవరం నియోజకవర్గం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదుకి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా నేను ఈ స్థాయికి వెళ్లేందుకు నాకు తోడ్పాటునందించిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌కి, టి ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘు రామరాజుకి, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ శ్రీనుకి ధన్యవాదాలు తెలియజేశారు. నాకు అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి కార్మికుల శ్రేయస్సు కై నిరంతరం శ్రమిస్తానని తెలియజేశారు.

## విశ్వనాధపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తి




**కోడూరు మేజర్ న్యూస్ :** కృష్ణానది తీరాన కొలువై ఉన్న విశ్వనాథపల్లి శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఏర్పాట్లు పూర్తయ్యాయి సోమవారం అమ్మవారికి విశేష అలంకరణ చద్ది నైవేద్యాలు సమర్పణ ఉంటుందని ఆలయ ఈవో మోహన్ రావు తెలిపారు, వీరితోపాటు చైర్మన్ నరసింహారావు ఉన్నారు. మంగళవారం ప్రధాన జాతర జరగడం తో భక్తులు సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏ ర్పాటు చేశారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈవో పేర్కొన్నారు.



19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999